# వెంపరాలలాం మనుషులు




వి.వి.బి.రామారావు

వయసు పాతిక దాటిపోయినా తార్కికంగా ఆలోచించడం, చైతన్యవంతంగా వూహించడం, మనీషిగా మనగడను మలచుకోవాలనుకోవడం సుశీల చేసే కృషి.

అసలు బాధంటే ఏమిటి?

యాబ్‌స్ట్రాక్ట్‌గా ఆలోచించాలనుకుని కుర్చీలో కూలబడింది బాధకి నిర్వచనం ఏమిటి?

డాక్టర్లు బాధని నిర్వచించడం చాలా కష్టమని చెబుతారు. నిర్వచన మేదైనా బాధ అనేక రకాలు.

తోటకూర తరుగుతున్నప్పుడు పరాకులో కత్తిపీట మీద వేలు కరుక్కుమంటుంది. తొందర తొందరగా జాకెట్టు చేతులు కుట్టుకుంటుంటే వేలిలో సూది కసుక్కున గుచ్చుకుంటుంది. కూర వేగుతున్న మూకుడు ముట్టుకుంటే చుర్రుమంటుంది. కాని వీటి బాధ క్షణికం.

సొంత బాధను అనుభవించడం కంటే తాదాత్మ్యం చెందిన మనిషి — తాళికట్టినాయన— బాధను ప్రత్యక్షంగా అనుభవిస్తూ, బాధపడినట్టు నటిస్తుంటే . . .

దీనికి పరిష్కారం?

తన బాధనైతే ఎలాగైనా దిగమింగుకోవచ్చు— కాని ఆయన పడే బాధ — యాతన— దాన్ని యాతన అనడమే న్యాయం.

లోకంలో అనేక రకాలైన మనుషులు—మనం చేయలేనివి ఆలా వది లెయ్యడం వివేచన—చెయ్యలేని పనుల్లో మనుషులను మార్చడం ఒకటి. బాధ పడడం వివేకం కాదు. ఇతరుల విషయాల్లో ఎంత తెలివిగా సలహా చెప్ప గలిగిన శక్తి ఉన్నా తన దగ్గర కొచ్చేసరికి ఆ శక్తి మొద్దు బారిపోతుంది.

అయిదున్నరయినా ఆయన జాడ లేదు. వీధి తలుపు బార్లా తెరిచి గుమ్మంలో కాసేపు నుంచుని, చూసి చూసి కాళ్ళు లాగుతున్న మూలాన లోపలి కొచ్చి మళ్ళీ కుర్చీలో కూలబడింది. ఆలోచన మాత్రం చేతిలోని పత్రిక మీదకు మళ్ళడం లేదు.

"హలో!"

కరుణాకర్ లోపలకు వచ్చే వరకూ సుశీల వాస్తవం లోకి రాలేదు.

"రండి! రండి" లేచి నుంచుంది.

"ఏమమ్మా! వీడు ఇంకా ఆఫీసునుంచి రాలేదా? ఆలస్యమైపోతూంది?"

"బస్సు దొరకలేదేమో—కూచోండి."

"సుశీలా, నువ్వేం అనుకోకు. కాని, కాస్త కాఫీ... పోన్లే వాడూ వస్తాడుగా—ఇద్దరం కలిసే తాగుతాం. ఏమమ్మా, మా ఇంటికి రావడానికి ఎందు కంత మొహమాటం. వచ్చి ఆరు నెల్లయ్యింది.— ఇప్పటికి వచ్చింది మీరు రెండు సార్లేగా! నేనేమో వారానికి పదిసార్లు వస్తాను! వదిన సంసారం ఎలా ఉందో అడపా తడపా చూస్తూ ఉండరాదూ?"

"నాకు ఇంటిపనులు— ఆయన ఆఫీసుకు అంకితం అయిపోయి ఎనిమిదింటి వరకూ రారు ఒకోసారి. ఏం తిరుగుతాం లెద్దూ అనేస్తారు. వదినగారు కులాసా? ఆఁ—ఆయన వచ్చేశారు."

కరుణ ముఖంలో వెలుగు తళుక్కుమంది. అది సుశీల వంటి లోని మెరుపుకు ప్రతిబింబమే.

"ఒరేయ్ రవీ! ఐ ఎన్వీయూ."

"ఎందుకుట? నే చేసే వెధవ ఉద్యోగం చూశా, లేక నే తినే చీవాట్లు వినా నీకు అసూయ?" రవి కోపంగా అడిగాడు.

"అదేమిట్రా ఆలా అంటావ్! ఆఫీసులో ఏదో గొడవ పడి వచ్చినట్టున్నావ్. ఎవడు చేసినా, ఏ ఉద్యోగమైనా ఒక విధంగా వెధవ ఉద్యోగమే, ఒక్క మంత్రి పదవి తప్ప. అవీ వెధవ ఉద్యోగాలనే మంత్రిపుంగవుల్ని కూడా ఒకరిద్దరిని తెలుసు. చెల్లాయ్!"

సుశీల అప్పటికే లేచి లోపలికి వెళ్ళిపోయింది.

రవి మళ్ళీ జోళ్ళు వేసుకునే ప్రయత్నంలో ఉండగా చూసి "మళ్ళీ వెళ్ళిపోతున్నావా?" అని అడిగాడు కరుణ కుర్చీలోంచి లేస్తూ.

"సిగరెట్లు"

"ఇదిగో—" పెట్టె తీసి టేబుల్ మీద పడేశాడు కరుణ.

"ఇవి నే కాల్చేవి కావు—అంత పెట్టిపుట్టలేదు."

"ఏమీ! నన్ను బాధించాలనుకొని నువ్వు బాధ పడుతున్నావ్! ఇందులో ఏదో గొడవ ఉంది. సుశీల కూడా మునుపటిలా లేదు. కారణం నేను తెలుసుకోకూడనిదై ఉంటుందని నేననుకోను . . . . నే చెయ్యగలిగి నదేదైనా ఉంటే . . ."

సుశీల రవి విప్పేసిన షూస్ బీరువా కిందకి తోసేసింది.

"ఏమిటమ్మా, నువ్వైనా చెప్పు?"

"వారినే అడగండి!" సుశీల లోపలికి వెళ్ళి పోయింది.

"మీ ఇద్దరిదీ ఆదర్శ దాంపత్యమనీ, మీలా ఉండగలడం దైవం ఇచ్చిన వరమనీ నేను మా ఆవిడతో అనని రోజు లేదు. మిమ్మల్ని తలచుకోని రోజూ ఉండదు. గాయత్రి మీద ప్రమాణం చేసి చెబుతున్నాను—మీ నాన్నగారు పెట్టిన అన్నమే ఈ రోజు నేను నీకంటె ఒక నాలుగొందలు జీతము ఎక్కువ తెచ్చుకున్నంత మాత్రాన మన స్నేహం చెడగొట్టేస్తావా? నేను నీకంటే ఏ విధంగానూ గొప్పవాడిని కాను— సుశీల లాంటి అమ్మాయి దొరకడం నీ అదృష్టం— గోపాలరావు చెల్లెలు నాకు కొత్తపిల్లా!"

"అన్నయ్య గారూ!" సుశీల లోపలకొస్తూ అంది." నామీద మీకున్న ఆదరాభిమానాలు నాకు తెలియనివి కావు. ఆయన గత రెండు మూడు నెలలు సరిగా తినడమూ లేదు. నిద్రాలేదు. అన్నగారూ, మీరైనా సాయం చెయ్యాలి!"

"సుశీలా!" రవి కసిరాడు.

"ఆప్తులకు కష్టం విడమరిచి చెప్పడంలో తప్పేముంది.? మీరు భరించే యాతనకంటే . . ."

"సుశీలా, ఆడవాళ్ళు ఇల్లాంటి విషయాల్లో కలగ చేసుకోవడం మగాళ్ళకి అలవాటు లేదనే. నువ్వు లోపలికి వెళ్ళు!"

సుశీల మాటమాట్లాడకుండా లోపలకు వెళ్ళి పోయింది.

కరుణ అలా కాసేపు కూచుని రవి ఏం మాట్లాడక పోవడం చూసి లేచి వెళ్ళి రవి పక్క కూచుని సొంతం విషయం చెప్పమని అడిగాడు.

"ఏం లేదురా . . .సింపుల్ . . . మా ఆఫీసర్‌కి నాకు స్నేహం ఎంత చిక్కనిదీ తెలుసుకదా! నేను ఆఫీసర్ చనువుగా ఉంట్రాం. అది నీకు తెలుసు— ఆవిడంటే పడనివాళ్ళు ఒక ముఠాగా తయారై పోయారు. ఆవిడ మంచిని కోరడం, ఆవిడను కాపాడలనుకోవడం— ఈ రెంటి వల్లా నేను వాళ్ళకి చెడ్డయ్యాను. ఆవిడ నా మీద అధికారి. నా స్నేహితుడి భార్య— నా మీద చాడీలు చెప్పే సాహసం వాళ్ళకి లేదు. ఆవిడ నాచేత చేయిస్తున్న పనిని ఆవిడ నాకు చేస్తున్న ఫేవరటిజమంటున్నారు వాళ్ళు రెండు రోజులు శలవు పెట్టి చూశారు. గొడవ సద్దుమణిగి పోతుందన్న ఆశతో—పని పేరుకుపోయింది. కోరినా సెలవు పెడితే ఆవిడ, నా స్నేహితుడి భార్య కాబట్టి గ్రాంట్ చేసిందంటున్నారు. వాళ్ళందరూ ఒకటై ఆవిడ దగ్గరకు నేర్పుగా వెళ్ళి నేను వెధవని పని చెయ్యనని చెప్పారు. ఆవిడ విధి ఆవిడ నిర్వర్తించింది అందరిలోనూ నన్ను తిట్టేసింది. ఛడామడా! అయినా నేను తల వంచుకుని పోయే ప్రయత్నమే చేశాను. ఈ మధ్య ఆవిడలో మార్పొచ్చింది. నేనంటే ఆవిడకు అసహ్యం ఏర్పడిపోయింది. కారణం నాకు ఎంత ఆలోచించినా అవగాహనకు రాలేదు. ముందు నన్నావిడ నలుగుర్లోనూ తిట్టడం కేవలం వాళ్ళని కొంచెం సమాధానపరచడం కోసమేమోనని భ్రమపడ్డాను. కాని నేను ఇంక ఆవిడచేత చీవాట్లు తినలేను. తినను. నువ్వు ఆమె భర్తవే కావచ్చు నాకు స్నేహితుడవే కావచ్చు. ఇందులో నువ్వు చెయ్యగలిగినది లేదు. ఆవిడ అన్న మాట నాకు మరీ బాధ కలిగించింది ఒకటి చెబుతున్నాను విను.

ఎంతో మందితో కలిసి పనిచేస్తుంటాం, అందరిని నెత్తినెక్కించుకుంటామా! ఆఫీసు జీవితం ఆఫీసు జీవితమే! వ్యక్తిగత జీవితం వ్యక్తిగతమే! రెండింటికీ అడ్డుగీత ఉంది. అది దాటే వాళ్ళంటే నాకు పరమ అసహ్యం! అంటూ నలుగురిలో పడపడా అనేసింది. ఇంకా పోయి. ఇతరుల విషయాల్లో జోక్యం చేసుకుని మనపై వాళ్ళకు మనం రక్షణ కల్పిస్తున్నామనుకోవడం మూర్ఖత్వం. వాళ్ళను వాళ్ళు రక్షించుకోలేని వాళ్ళు అధికారు లెలా అవుతారు?" అంది

ఇదీ ఆవిడ ఇచ్చిన లెక్చరు సారాంశం—ఇప్పుడు చెప్పు—నా పని కంటె ఎక్కువ చెయ్యడం తప్పా? ఆవిడకు సపోర్టుగా ఉండటం తప్పా! ఆవిడ ఎదుట...

"క్షమించాలి! మీ అనుమతి లేకుండానే మీ ఇంటి లోకి వచ్చేశాను." రాధిక వచ్చింది లోపలికి.

భార్యను చూసి ఆశ్చర్యపోయాడు కరుణ.

"మీరు ఆఫీసరుగా లోపలికి వచ్చే రవ చాతీసుకుంటే కింది ఉద్యోగిని నేనేం చేయగలను? కరుణ భార్యగా వస్తే నాకు చాలా సంతోషం—నా అవి

**కోపం**

కోపగించుకోవడం అంటే, ఇతరులు చేసిన తప్పుల్ని మనపై సాధించడం.

—పోప్




నకు మరీను. ఆఫీసరుగా రాలేదనే నా విశ్వాసం."

"యూ ఆర్ రైట్ రవిగారూ! నేను ఆఫీసరుగా రాలేదు. కూర్చోవచ్చా?"

"ఇంటికి ఆడబడుచు ఇంటికి వచ్చి కూచో వచ్చా అని అడుగుతుందా?"

సుశీల రంగంలోకి వచ్చింది.

"లేదమ్మా, నే ననుకోలేదు. కాని ఇది పురుష సామ్రాజ్యం—ఇందులో తోబుట్టువునైనా ఆఫీసర్ అంటే ఆఫీసర్‌గానే చూడడం ఈ మగాళ్ళకే చెల్లింది. ఆడదాన్ని ఆబ్జెక్టివ్‌గా చూసే స్థితికి మగాళ్ళు ఎదగలేదు. కనీసం తోటి ఆడదాన్ని అలా చూసే స్థితికి మనల్ని రానివ్వడం లేదు. మనం ఆడవాళ్ళమమ్మా! నా దగ్గర పని కావలిస్తే మా ఆయనచేత నాకు చెప్పించ చూస్తారు సులువుగా! మగాడు ఆఫీసర్ అయితే అతని భార్య దగ్గరకు వెళ్తారా? అటు స్త్రీగా విలువల్ని కాంప్రమైజ్ చేసుకోకుండా, ఇటు బాధ్యత కలిగిన ఉద్యోగిగా, అధికారిగా నలుగురి చేత పని చేయించడం తెలివైన పని. రెండు రాటుపద్యతాటి మీద నడక—ఏ మాత్రం తేడా వచ్చినా, పడుతానా విరుగుతుంది—నగు బాట్లైనా అవుతుంది. . ."

"పోనీలే వదినా, దీనిలో ఇంత బాధ పడడానికి ఏముంది? ఆయన ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటే పోతుందిగా!"

"దానికీ కాగితం నా చేతి మీదుగానే వెళ్ళాలి. బ్రిటిష్ వాళ్ళు వాళ్ళ మధ్య గొడవ వస్తే భరించే శక్తి లేక—నిర్ణయాలు తీసుకునే బాధ్యత నెత్తిన వేసుకునే స్తోమతలేక ఒకరిని మీద మరొకటి పిచ్చిన పెట్టెలా పదవులను చేసి ఎక్కడి కక్కడ సర్దుమణిగేలా—కిందవాడి మాట సరాసరి మీది వాడు వినకుండా కట్టుదిట్టాలు చేశారు. అయామ్ సారీ రవిగారూ. . .ఏవో దృష్టిలో పెట్టుకుని ఏదో చేస్తాం! మనం చేయాలనుకున్నది ఒకటి, చేసేదొకటి—జరిగినదంతా మరిచిపోండి!"

రవి మాట్లాడలేదు. కరుణ భార్యవంకే చూస్తూ, ఆలోచనలో పడ్డాడు. రాధిక కుర్చీలో నుంచి లేచి సుశీల దగ్గరగా వచ్చి కూర్చుంది.

'చూడమ్మా సుశీలా! ఈయన ఇక్కడ ఇంత కుదురుగా కూచున్నారా? నేను మాత్రం ఇక్కడికి రాకూడదట! పైగా రోజూ లెక్చర్లు, కామెంట్సు, సుశీలా నువ్వు కాఫీ చెయ్యలేవోయ్! సాంబారు సుశీల చేసినట్టు లేదు సుమా! అయినా ఆడదానికి ఉద్యోగమిస్తే మొగుడి మాటేమిటి? ఇదీ ఆయన వరస—మరీ రెచ్చి పోతున్నారీ మధ్య. నేను ఏమైనా జవాబు చెప్పానా, మహా గొడవైపోతుంది. ఆడదానికి ఉద్యోగం ఉంటే అది ఇంట్లో కూడా అధికారమే చెలాయిస్తుంది—మరో మెట్టు పైకి పోతారు—ఈ నరకం నాకు వద్దు—రవిగారంటే నాకెంతో గౌరవం—నలుగురు చేసే పని చేస్తూ నాకు ఆసరాగా ఉంటారు ఆఫీసులో—స్టుపిడ్ ఫెలోస్, ఆయన్ని నేనేదో ఫేవర్ చేస్తున్నాననుకుంటారందరూ. ఆఫీసులో పని జరగాలంటే నేనూ కొంత సహించాలి. పని జరగక పోతే పైవాళ్ళు ఊరుకోరు. అలాగని ఆడదాని పని చేసే వాళ్ళే ఉండరు—వ్యక్తిగా నాకు జీవితం ఉందనీ, ఆఫీసరుగా వ్యక్తుల ఆత్మాభిమానాన్ని నొప్పించలేని సూత్రాలు మనిషికి నేనెంత చెప్పినా బుర్రకెక్కదు—నే పడే బాధ బట్టి రవిగారి బాధను అర్థం చేసుకోగలను. మళ్ళీ చెబుతున్నా రవిగారూ! యూ జస్ట్ ఫర్‌గెట్ ది పాస్ట్!"

"చూశావ్‌రా! ఎంత లెక్చరిచ్చిందో? బావుంది. అసలు నువ్వు ఇక్కడికి ఎందుకొచ్చావ్? సారీ చెప్పడానికా?"

"అలా అడిగారు బావుంది! చూడమ్మా, నేను ఇంటికి వెళ్ళేసరికి ఈయన వచ్చి వెళ్ళారని చెప్పింది వంట మనిషి. ఇక్కడికే వచ్చి ఉంటారని సరాసరి వచ్చేశాను. కాస్త కాఫీ ఇస్తావా తల్లీ!"

"కాఫీ మాటకేంకాని. . ." కరుణ ఏమో అడగబోయాడు.

"చూశావా సుశీలా! తలపడి పోతుందంటుంటే, 'కాఫీ మాటకేంలే' అంటున్నారు. ఇదీ మన మగాళ్ళ అవగాహన శక్తి. దేనికైనా అదృష్టం ఉండాలి. ఈ ఉద్యోగం వద్దు. ఈ గొడవలూ వద్దు. నే సెలవు పెట్టేస్తా!" సుశీల కాఫీ పట్టుకొచ్చింది.

"అసలు సెలవెందుకు? నువ్వు ఉద్యోగం చెయ్యక పోతే ఏం?"

"ఈ డైలాగులన్నీ పాతవే కాని—ఎడ్మినిస్ట్రేషన్‌లో—అమ్మాయ్ కాఫీ చాలా బావుందమ్మా! ఆయన పొగుడుతుంటే ఏమో అనుకున్నా! నిజంగా బావుంది—ఎడ్మినిస్ట్రేషన్‌లో నిర్ణయాలు తొందర పడి తీసుకోరు. అలా నొప్పి నిర్ణయాలు తీసుకో వలసిన అవసరమే ఏర్పడితే—'డిఫర్ రియాక్షన్' అనేసి ఫైలు మూలపడేస్తారు. అందుకే సెలవ్! రిజిగ్నేషన్ తొందరపాటవుతుంది."

"మీరు ఇంత మంచివారని అన్నగారు నాకు చెప్పనేలేదు!!"

"చూడమ్మా, మీరు మీరు అంటే నాకు బాధగా ఉంటుంది. నా పేరు రాధిక—నిన్ను నువ్వని ఎలానూ పిలిచేస్తున్నాను. నువ్వు నన్ను నువ్వంటే. . ."

"అయితే నువ్వూ అన్నగారూ రాత్రికి భోజనానికి. . ."

"చూశావ్‌రా! నీకంటే మా చెల్లెలే నయం—"

"ఓరి స్టుపిడ్ ఫెలో, నా ఇంట్లో నిన్ను నేను భోజనానికి పిలవాలా?" మాటా మాటా నొక్కి అడిగాడు రవి.

మరో గంట మాటా మంతీ ఆడుకుని భోజనాలయినాక రవి, కరుణనీ రాధికనూ ఆటో స్టేండు వరకూ దిగబెట్టి వచ్చాడు.

రవి ఇంటికొస్తూనే సుశీల అడిగింది! "చూశారా! ఆవిడను మీరు ఎలా అపార్థం చేసుకున్నారో!"

"లేదు—సరిగానే అర్థం చేసుకున్నా! ఇదంతా నాటకం. వాడి సమక్షంలో ఆవిడ అలానే మాట్లాడుతుంది. ఆఫీసులో వరస మళ్ళీ మామూలే! లేదు సుశీలా—ఐ కాంట్ స్టాండ్ ఇట్! నేను సెలవు పెట్టేస్తా—ఒక వారం మీ వాళ్ళ ఇంటికి పోయి అక్కడ నుంచి అమ్మ దగ్గరకు పోదాం. . . ట్రాన్స్‌ఫర్ అదే అవుతుంది. . . సుశీ. . . నువ్ ఉద్యోగం చెయ్యలేదన్న విచారం ఒకప్పుడు ఉండేది. అయాం హేపీ నౌ! నువ్ ఉద్యోగం ఎప్పుడూ చెయ్యకుండా ఉంటేనే నయం."

సెలవు కాగితం ఇంటి దగ్గరే రాసి ఆఫీసుకు పట్టుకెళ్ళాడు రవి.

పదకొండయినా ఆఫీసుకు రాధిక రాలేదు. మరో అరగంటయ్యాక తెలిసింది, రాధిక రెండు నెలలు సెలవు పెట్టినట్టు.

'స్నేహం, ఉద్యోగం, ధర్మం, అభిమానం—ఈ వలయాలలో పడి కొట్టుకుంటున్న మగాడినే అర్థం చేసుకోలేం—ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం అసంభవం' అనుకుని కాగితం ముక్కలు ముక్కలుగా చింపి పెంటు జేబులో పెట్టుకున్నాడు.

"నే అరగంటలో వచ్చేస్తా, ఎవరైనా అడిగితే బయటికి వెళ్ళానని చెప్పు" అని అటెండరుతో చెప్పాడు రవి. *